క్లుప్తంగా

స్టడీ మెటీరియల్ పంపిణీ



హన్వాడ: మండలంలోని టంకర జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం పదో తరగతి విద్యార్థులకు సర్పంచ్ అచ్చన్నయాదవ్ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. అనంతరం గ్రామానికి చెందిన మరో యువకుడు ఇటీవల విద్యాఘాతంతో చికిత్స పొందుతున్నాడు. బాధిత యువకుడికి ఖర్చుల నిమిత్తం రూ.5వేలను అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాజశేఖర్‌రావు, వార్డు సభ్యులు వెంకటేష్, శేఖర్, హన్మంతు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఓబ్లాయిపల్లితండాలో వైద్యశిబిరం



పాలమూరు: రవి చిన్న పిల్లల ఆస్పత్రి ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని ఓబ్లాయిపల్లి తండాలో చిన్నారులకు ప్రత్యేక ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. చిన్నపిల్లల వైద్యులు 120మంది చిన్నారులకు అన్ని రకాల వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ విస్లావత్ అంజమ్మ, వైద్యులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం



దేవరకద్ర రూరల్: కొత్తకుంట్ల మండల కేంద్రంలో తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన బ్రహ్మంను బుధవారం స్థానిక నాయకులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ కేబీఆర్ గౌడ్, కొండన్న, గిరి, యాకూబ్, నజీర్ పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువుల తయారీపై శిక్షణ




కోయిల్‌కొండ: గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా 2018–19 సంవత్సరంలో వంద రోజులు పూర్తి చేసుకున్న ఉపాధి కూలీలకు స్వయం ఉపాధి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ జయరాములు, సమన్వయకర్త చరణ్ కూలీలకు అవగాహన కల్పించారు. శిక్షణ అనంతరం ఆసక్తి గల వారికి డీఆర్‌డీఏ, ఎస్‌బీఐ ద్వారా ఆర్థిక రుణాలు కూడా ఇవ్వడం జరుగుతుందని అన్నారు. వారి వెంట ఏపీఓ నర్సయ్య, పంచాయతీ కార్యదర్శి రజిత పాల్గొన్నారు.

మౌలానా ఆజాద్‌కు ఘన నివాళి

పాలమూరు: స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం పట్టణ మైనార్టీ విభాగం అధ్యక్షుడు అజ్మత్‌అలీ ఆధ్వర్యంలో మౌలానా అబుల్‌కలాం ఆజాద్ వర్ధంతి నిర్వహించారు. మౌలానా ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీర్ మహ్మద్ సాధిక్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు లక్ష్మణ్‌యాదవ్, అవేజ్, సాయిబాబ, సీరాజ్‌ఖాద్రీ, అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు టై, బెల్టులు వితరణ



బాలానగర్: మండలంలోని మొదంపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మాజీ ఏఎంసీ డైరెక్టర్ సూదిని శివానందరెడ్డి, సర్పంచ్ సువర్ణ టై, బెల్టు, ఐడీకార్డులు పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు తోచిన సాయం చేయాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామస్తులు గురుపాదం, శ్రీనివాస్, హన్మనాయక్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): హన్వాడ మండలానికి చెందిన అబ్దుల్‌జబ్బార్ వైద్య ఖర్చుల కోసం సీఎంఆర్‌ఎఫ్ కింద మంజూరైన రూ.2.50లక్షల ఎల్‌ఓసీని బుధవారం మంత్రి శ్రీనివాస్‌గౌడ్ క్యాంపు కార్యాలయంలో బాధితులకు అందజేశారు. మెరుగైన వైద్యం చేయించుకోవాలని సూచించారు.

తాగునీటికి తంటాలు

- కేజీబీవీలో పనిచేయని బోరుమోటారు, వాటర్‌ప్లాంట్
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులు



నీటి కోసం హాస్టల్ ఆవరణలో గుమిగూడిన విద్యార్థులు



బకెట్లతో నీళ్లను తీసుకెళ్తున్న విద్యార్థులు



మరమ్మతుకు నోచుకోని వాటర్‌ప్లాంట్

మహమ్మదాబాద్: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో విద్యార్థులకు తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాలలో 200 మంది విద్యార్థులకు గాను 440 మంది విద్యార్థులు ఉన్నారు. అలాగే గండేడ్ కేజీబీవీకి చెందిన 6,7 తరగతులకు చెందిన 73మంది విద్యార్థులు ఇక్కడే ఉన్నారు. నిత్యం వినియోగించేందుకు ఒకే ఒక్క సింగిల్ ఫేజ్ బోరుమోటారు ఉండగా, మరో బోరులో మోటారు లేక వృథాగా ఉంది. విద్యార్థులకు సరిపడా బాత్రూంలు లేక ఆరుబయటే ముఖాలు కడుకోవాల్సి వస్తుంది. రెండు, మూడు రోజులకు ఒకసారి నీళ్లు వస్తుండడంతో స్నానాలకు ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. వాటర్‌ప్లాంట్ నెల రోజులుగా పనిచేయకపోవడంతో విద్యార్థులకు బోరునీరే దిక్కయ్యింది. దీంతో విద్యార్థులు తరచుగా అనారోగ్యం పాలవుతున్నట్లు చెబుతున్నారు. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.

రెండు రోజులకు ఒకసారి స్నానాలు..



పాఠశాలలో 440 మంది విద్యార్థులకు సరిపడా నీరులేక రెండు, మూడు రోజులకు ఒక సారి స్నానాలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. ఒకే ఒక్క బోరుతో అందరూ విద్యార్థులు నీళ్లు బయట గ్రౌండ్‌లోనే పట్టుకుని ఇక్కడే ముఖాలు కడుక్కుంటున్నాం. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి.

– ఆర్.భారతి, ఇంటర్ ప్రథమ సంవత్సరం

తాగునీటికి ఇబ్బందులు..



కనీసం తాగేందుకు తాగునీరు లేదు. స్నానాలు, కాలకృత్యాలకు నీళ్లు సరిపోకుంటే ట్యాంకర్ ద్వారా అందిస్తారు. 440 మంది విద్యార్థులంతా క్యూ కట్టి నీరు తీసుకోవాలి. చెడిపోయిన బోరుమోటారు, వాటర్‌ప్లాంట్‌ను బాగు చేయించాలి. అలాగే అదనపు బాత్‌రూంలను ఏర్పాటు చేయించాలి.

– అనూష, ఇంటర్ ప్రథమ సంవత్సరం

సకాలంలో వైద్యం అందించాలి



నట్టల నివారణ మందులు ఇస్తున్న డాక్టర్ మధుసూదన్

అడ్డాకుల: మూగజీవాలకు వ్యాప్తించే వ్యాధులను సకాలంలో గుర్తించి చికిత్స చేయించాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ మధుసూదన్ అన్నారు. మూసాపేట మండల కేంద్రంలో బుధవారం గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులను పంపిణీ చేశారు. 3,015 గొర్రెలు, 185 మేకలకు మందులను వేసినట్లు తెలిపారు. గురువారం నిజాలాపూర్, మహ్మదుస్సేన్‌పల్లి గ్రామాల్లో నట్టల నివారణ మందులు వేయనున్నందునా కాపరులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సిబ్బంది చంద్రమోహన్‌గౌడ్ ఉన్నారు.

ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి



మాట్లాడుతున్న ఎస్‌ఐ శైలజ

భూత్పూర్: అమ్మాయిలపై అఘాయిత్యాలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని యాంటీహ్యూమెన్ ట్రాఫికింగ్ యూనిట్ ఉమెన్ ఎస్‌ఐ శైలజ అన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని అమిస్తాపూర్ సారికా టౌన్‌షిప్‌లో గల మహాత్మాజ్యోతిరావు పూలే బీసీ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో సామాజిక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ శైలజ మాట్లాడుతూ ప్రేమ పేరుతో ఆకర్షితులై జీవితాలను దర్భరం చేసుకుంటున్నారని అన్నారు. ఉన్నత చదువులు చదివి జీవితంలో స్థిరపడేందుకు కృషి చేయాలని సూచించారు. బాల్యవివాహాలను అరికట్టాలని, అక్రమ రవాణా, ఫోక్సో యాక్టు 2012, కిడ్నాప్, అవయవాల అమ్మకాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఆపదలో 1098, 100, 1930 నంబర్లకు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో స్థానిక పోలీసు సిబ్బంది, జ్యోతిరావుపూలే బాలికల పాఠశాల ప్రత్యేక అధికారి బస్వరాజ్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రత్యేకాధికారుల పర్యటన



నవాబుపేటలో విద్యార్థులతో మాట్లాడుతున్న అధికారులు

నవాబుపేట: మండలంలోని పాఠశాలల్లో కొనసాగుతున్న నూతన విద్యాబోధన కార్యక్రమాల అమలు తీరును పరిశీలించేందుకు రాష్ట్ర బృందం అధికారులు మండలంలో బుధవారం పర్యటించారు. మండల కేంద్రంతో పాటు కొల్లూర్, పోమాల్, యన్మన్‌గండ్ల పాఠశాలలను తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు సులువుగా అర్థమయ్యేలా విద్యాబోధన చేయాలని సూచించారు. కార్యక్రమంలో మధుసూదన్‌రెడ్డి, దామోదర్ రెడ్డి, మదన్, వీరేశం, లక్ష్మీనర్సింహారావు, మండల విద్యాశాఖ అధికారి రాజునాయక్, సీఆర్‌పీ జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

262మందికి కంటి పరీక్షలు



భూత్పూర్: మున్సిపాలిటీలోని 9వవార్డు, మండలంలోని మద్దిగట్లలో బుధవారం 262 మందికి కంటి పరీక్షలు చేసినట్లు సీహెచ్‌ఓ రామయ్య తెలిపారు. 84 మందికి కంటి అద్దాలు పంపిణీ చేయగా, 80మందికి అద్దాలు రావాల్సి ఉందని, 52 మందికి కంటి ఆపరేషన్ నిమిత్తం రెఫర్ చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు హిమబిందు, మహ్మద్ అబ్దుల్ రబ్, రాధిక, సర్పంచ్ ప్రియాంక పాల్గొన్నారు.

మహమ్మదాబాద్: ప్రభుత్వం ప్రవేశపెట్టిన కంటి వెలుగు పథకం ద్వారా మహమ్మదాబాద్, మంగంపేట్ గ్రామాల్లో 260 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారి మహమ్మద్ తెలిపారు. నేటి నుంచి షేక్‌పల్లి, మొకర్లాబాద్ గ్రామాల్లో కంటి వెలుగు శిబిరాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కర్రలపైనే కరెంటు తీగలు



పోమాల్ సమీపంలో కర్రలపై ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలు

- మృత్యువాత పడుతున్న రైతులు, మూగజీవాలు
- పట్టించుకోని అధికారులు

నవాబుపేట: పంటపొలాల్లో బోరుమోటార్లు ఏర్పాటు చేసుకునేందుకు చాలా వరకు విద్యుత్ స్తంభాలు లేకపోవడంతో రైతులు కర్రల సాయంతోనే విద్యుత్ వైర్లు లాగి కనెక్షన్ తీసుకుంటున్నారు. దీంతో ఈదులు గాలులు వీచినప్పుడు, అనుకోని ప్రమాదంలో రైతులు, మూగజీవాలు మృత్యువాత పడుతున్న సంఘటనలు నెలకొంటున్నాయి. సరైన విద్యుత్ సామగ్రి లేక రైతులు కర్రలపై విద్యుత్ వైర్లు వేలాడదీసి సాగు చేస్తున్నారు. అధికారులు స్పందించకపోవటంతో చాలా గ్రామాల్లో రైతులే వ్యవసాయ పనులు చేస్తూ విద్యుత్ ప్రమాదాలకు గురవుతున్నారు.

మండలంలో ఇలా..

మండలంలో మొత్తం 54 పంచాయతీల్లో 7 విద్యుత్ సబ్‌స్టేషన్లు ఉండగా, దాదాపు 12వేల పైచిలుకు విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీరంతా కనెక్షన్ కోసం డీడీలు తీసినవారే. కాగా, వీరికి మొత్తం సామగ్రి సమకూర్చాల్సి ఉండగా, ఏర్పాటు చేయకపోవటం శోచనీయం. ఎక్కువగా పోమాల్, దొడ్డిపల్లి, మెగుళ్లపల్లి, మరికల్, కొల్లూర్, కాకర్లపహాడ్, కారుకొండ, చౌడూర్, కొల్లూర్ గ్రామాల్లో చాలా మంది రైతులు కర్రలపై విద్యుత్ వైర్లతో సాగు చేస్తున్నారు. మండలంలో 27వేల హెక్టార్ల భూమి బోరు నీటిపై ఆధారపడి సాగు చేస్తున్నరు.

ఎవరూ పట్టించుకోరు..

విద్యుత్ స్తంభాల కోసం ఎన్నిసార్లు తిరిగినా ఎవరూ పట్టించుకోరు. కాంట్రాక్టర్ వస్తాడని చెబుతున్నా ఎవరూ స్పందించడం లేదు. కర్రలపై వైర్లు లాగి సాగు చేస్తున్నాం. విద్యుదాఘాతంతో రైతులు, మూగజీవాలు మృతిచెందుతున్నాయి.

– ఆంజనేయులు, నవాబుపేట

సామగ్రి కొరత..

మండలంలో రైతులకు సరిపడా విద్యుత్ సామగ్రి లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వచ్చిన సామగ్రిని విడతల వారీగా అందిస్తున్నాం. అనధికార విద్యుత్ కనెక్షన్లతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. పల్లెప్రగతి పనులకు 257 స్తంభాలు కావాల్సి ఉండగా, కేవలం 70మాత్రమే వచ్చాయి.

– సంతోష్, ట్రాన్స్‌కో ఏఈ, నవాబుపేట

అదనంగా డబ్బులు వసూలు చేయొద్దు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: గ్యాస్ సిలిండర్‌ను డెలివరీ చేసినందుకుగాను వినియోగదారుల నుంచి అదనంగా డబ్బులు వసూలు చేయొద్దని నిర్వాహకులను డీసీఎస్‌ఓ బాలరాజు ఆదేశించారు. మహబూబ్‌నగర్ పట్టణం క్రిస్టియన్‌పల్లిలోని ఆర్యన్ హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీకి చెందిన డెలివరీ బాయ్‌లు సిలిండర్‌కు రూ.1,108తో పాటు అదనంగా రూ.30లు తీసుకుంటున్నట్లు ఇటీవల కొందరు వినియోగదారులు జిల్లా అదనపు కలెక్టర్ సీతారామారావుకు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు బుధవారం డీసీఎస్‌ఓ బాలరాజు, డీటీ స్వప్న తదితరులు విచారణ చేపట్టారు. భవిష్యత్‌లో అదనంగా డబ్బులు వసూలు చేసినట్లు ఫిర్యాదులు వస్తే గ్యాస్ ఏజెన్సీపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీంతో ఇకముందు వినియోగదారుల నుంచి అదనంగా వసూలు చేయబోమని నిర్వాహకులు బదులిచ్చారు. ఈ మేరకు వారు ఒక ప్రకటన జారీ చేశారు. ఏజెన్సీ తరఫున ప్రతినెలా డెలివరీ బాయ్‌లకు వేతనంతో పాటు రవాణా ఖర్చులు చెల్లిస్తున్నామని అందులో పేర్కొన్నారు. వినియోగదారులెవరూ తమ డెలివరీ బాయ్‌లకు అదనంగా డబ్బులు చెల్లించొద్దని సూచించారు.

బాధితులకు మంత్రి పరామర్శ

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): అనారోగ్యంతో జిల్లా కేంద్రంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మున్సిపల్ కార్మికుడు బాలయ్యను బుధవారం మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పరామర్శించారు. అనంతరం మోనప్పగుట్టకు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు కృష్ణను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

కేంద్ర నిధులతోనే పాలమూరు అభివృద్ధి



జిల్లా కేంద్రంలో మాట్లాడుతున్న ఎన్‌పీ వెంకటేష్

పాలమూరు: అధికారం అడ్డుపెట్టుకుని దేవుడి భూములను సైతం మాయం చేస్తున్నారని బీజేపీ నాయకుడు ఎన్‌పీ వెంకటేష్ ఆరోపించారు. బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి పట్టణంలోని భగిరథ కాలనీలో కార్నర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలమూరులో గతంలో ఎంతో మంది ఎమ్మెల్యేలు, మంత్రులుగా పని చేశారని, ఇంత అరాచక విధానాన్ని కొనసాగించలేదన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని తెలిపారు. అనంతరం మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అంజయ్య మాట్లాడుతూ అమృత్ సిటీ నిధులతో పాలమూరు అభివృద్ధి చెందిందన్నారు. కేంద్రం నిధులతో మిషన్ భగిరథ నీళ్లు ఇచ్చారన్నారు. పాలమూరులో కుంటలు, గుట్టలు పూర్తిగా మాయం అవుతున్నాయని ఆరోపించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మచారి, పాండురంగారెడ్డి, నారాయణయాదవ్, కిరణ్‌కుమార్‌రెడ్డి, సంపత్, సుబ్రమణ్యం, మోహన్ పాల్గొన్నారు.

ప్రభుత్వ విధానాలను ఎండగడుదాం..

హన్వాడ: ప్రజలకు ఇచ్చిన హామీల్లో విఫలమైన బీఆర్‌ఎస్ ప్రభుత్వ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగట్టాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పద్మజారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మచారి పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని శేక్‌పల్లిలో ప్రజాగోస–బీజేపీ భరోసా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కేంద్రం అమలు చేస్తున్న ఉచిత బియ్యాన్ని ప్రజలకు వివరించాలన్నారు. అదేవిధంగా పంచాయతీలకు కేంద్ర నిధులే ఆధారమయ్యాయని విమర్శలు చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వీరబ్రహ్మచారి, కొండా బుచ్చిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షుడు వెంకటయ్య, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ అరవింద్‌రెడ్డి

అడ్డాకుల: రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులను పక్కదారి పట్టిస్తున్నారని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని చిన్నమునుగల్‌చేడ్‌లో శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ సంగిరెడ్డి అరవింద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రజా గోస–బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా కార్నర్ మీటింగ్‌లో బుధవారం ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధుల గురించి ప్రజలకు సమాచారం తెలియకుండా బీఆర్‌ఎస్ నాయకులు మోసం చేస్తున్నారని అన్నారు. సమావేశంలో వనపర్తి జిల్లా అధ్యక్షుడు అనుజ్ఞారెడ్డి, మల్లేష్‌గౌడ్, సురేందర్‌రెడ్డి, అరవింద్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, జాంగీర్ యాదవ్, రాంబాబు, నర్సింహాగౌడ్, రాఘవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



విద్యార్థులతో ఉపాధ్యాయులు

దేవరకద్ర: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం విద్యార్థులు ఘనంగా స్వపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఎంఈఓగా అమూల్య, హెచ్‌ఎంగా గంగోత్రి, ఉపాధ్యాయులుగా నిక్షిత, కవిప్రియ, గీతాంజలి, నేష, హేమంత్, బాలమురళీకృష్ణ వ్యవహరించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఆంజనేయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామాల్లో నిఘా ఏర్పాటు చేయాలి



రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ మహేష్

చిన్నచింతకుంట: గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా నిఘా ఏర్పాటు చేయాలని డీఎస్పీ మహేష్ ఎస్‌ఐ భాగ్యలక్ష్మారెడ్డికి సూచించారు. బుధవారం చిన్నచింతకుంట మండలంలోని పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో దొంగతనాలు, నేరాల అదుపునకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి నిఘా పెంచాలని తెలిపారు. ఇసుక అక్రమ తరలింపుపై ఉక్కుపాదం మోపాలని తెలిపారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహాల ప్రతిష్ఠాపన



పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్

బాలానగర్: మండలంలోని హేమాజీపూర్ శివాలయంలో శ్రీ వినాయక, కుమార స్వామిల విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం బుధవారం వైభవంగా నిర్వహించారు. వేద పండితుల సమక్షంలో ప్రత్యేక పూజలు చేసి విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. ఆలయాన్ని విద్యుద్దీపాలు, మామిడి తోరణాలతో అలంకరించారు. మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ ఆలయంలోని శివలింగం, వినాయక, కుమార్ స్వామిలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో పవన్ కుమార్, నర్సింహా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యూనిట్ల వివరాలు నమోదు చేయాలి



చారకొండ: దళితబంధు పథకం ద్వారా ప్రభుత్వం అందించిన యూనిట్ వివరాలను, వ్యాపార లావాదేవీలను దళితబంధు మొబైల్ యాప్‌లో నమోదు చేయాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రాంలాల్ అన్నారు. మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం దళితబంధు పథకం మొబైల్ యాప్‌పై గ్రామ పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఈడీ రాంలాల్ హాజరై మాట్లాడారు. మండలంలోని కల్వకుర్తి, అచ్చంపేట నియోజకవర్గాల సంబంధించి మొత్తం 1,407 లబ్ధిదారులకు దాదాపు 90మంది లబ్ధిదారులకు యూనిట్లు అందించినట్లు తెలిపారు. అనంతరం జీవన స్థితిగతులపై మార్పు వచ్చిందా.. పూర్తి వివరాలను సేకరించి మొబైల్ చేయాలని కార్యదర్శులకు సూచించారు. ఎంపీడీఓ జయసుధ, ఎంపీఓ వెంకటేష్, అధికారులు ఉన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం

కల్వకుర్తిరూరల్: అన్నదానం మహాదానమని లయన్స్ క్లబ్ కల్వకుర్తి అధ్యక్షుడు కల్మిచర్ల రమేష్, ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుడు శివరాం అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స కోసం వచ్చే గర్భిణులు, బాలింతలు, రోగుల కోసం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. క్లబ్ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు ప్రణాళికాబద్ధంగా చేపడుతూ వస్తున్నామన్నారు. క్లబ్ కార్యదర్శి శ్రీధర్, మిర్యాల శ్రీనివాస్ రెడ్డి, కిషన్, గోవిందు శ్రీనివాస్, రమేష్, అశోక్, ప్రకాశ్, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.